'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# అద్దిరబన్నా మోదన్నా ముద్దర మూల్యం కడతావా!

***ప్రధానమంత్రి మోదీ వచ్చారు.***
***ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అంతకుముందే వచ్చింది.***
***ఈడీ-మోదీ బంధం ఇదే కదా?***
***11 మార్చి 2023న ఢిల్లీ ఆఫీసులో విచారించిన ఇన్నాళ్లకు ఇప్పుడే ఏం తొందరో?***
***సుప్రీంకోర్టు తీర్పు, జస్ట్ మూడ్రోజుల్లో రానుందనే అంచనాలుండగానే ఈడీ ఉరుకులాడింది.***

ఆవగింజంత అయినా సరాసరి ప్రమేయం లేని ఓ పేలవమైన కేసులోని అబద్ధం గడప దాటేలోగా, కక్షసాధింపు అనే అసలు నిజం ప్రపంచానికి రీచ్ అయింది! సరిగ్గా పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు రోజు ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేసింది. ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలతో నక్కి నక్కి బనాయించిన కేసు ముద్రకు మూల్యం చెల్లించాల్సిన సమయం మోదన్న ద్వయానికి, వాళ్ల సుకుమార పార్టీకి ఆసన్నమైందనే ఆగ్రహం బీఆర్ఎస్ శ్రేణుల్లో పెల్లుబుకుతున్నది. తమ ఆడబిడ్డ, వర్తమాన వీరవనిత కవితకు తెలంగాణ పౌర సమాజం, నైతికంగానే కాదు, ప్రజా కోర్టులోనూ మద్దతుగా నిలుస్తారని తేల్చి చెబుతున్నది.

రాజకీయాల్లో, పబ్లిక్ లైఫ్‌లో మనగలగాలంటే దమ్ము ధైర్యం ఉండాలని బంగారు తెలంగాణ నిర్మాత కేసీఆర్ ఊరకే అనలేదు. కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో ప్లాంటెడ్ కేసులో తన తనయే ఇపుడు కాల పరీక్షలో జంకూ బొంకూ లేకుండా నిటారుగా నిలబడింది. రాజకీయ అభద్రతతో వేసిన ముద్రకు వ్యవస్థల్లో అన్నింటికన్నా పవర్‌ఫుల్ అయిన ప్రజాకోర్టులో మోదన్న జట్టు తగిన మూల్యాన్ని చెల్లించుకోకతప్పదు. నమ్మిన సిద్ధాంతాలకు, ప్రజా సేవకు తిరుగులేని నిబద్ధత అయిన కవిత శక్తి సామర్థ్యాలకు ఒకే ఒక్క మచ్చ తునక మనందరి మస్తిష్కంలో నేటికీ సజీవంగా కదలాడే సన్నివేశం ఇక్కడ సందర్భోచితం. తెలంగాణ రాష్ట్ర సాధన స్వప్నాన్ని సాకారం కాకుండా, కడదాకా చిదిమేయ చూసిన నాటి పాలకులు ఉద్యమ సారథి కేసీఆర్‌ను కరీంనగర్ అల్గునూరు చౌరస్తాలో అరెస్టు చేసి, తమకు అనువైన ఖమ్మానికి తరలించారు. అక్కడి నుంచి నిమ్స్‌లో ఆమరణదీక్ష వరకు 'అటు నాన్న-ఇటు తెలంగాణ' అత్యంత ఛాలెంజింగ్ సమయంలో తానూ తన సోదరుడు కేటీఆర్ చూపిన, చాటిన పటిమ ఎప్పటికీ మరువని చరిత్ర. అటువంటి కవితను అపఖ్యాతి పాలు చేయడం ఎవరి తరమూ కాదనేది కవిత అనుయాయుల వాదన. ప్రజా చైతన్య చేతన కవితను తాత్కాలికంగా ఇబ్బంది పెట్టినా.. అంతకంతకూ అనుభవించక తప్పని ప్రాప్త కాలజ్ఞత చవిచూస్తారని శపిస్తున్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీకి మించి భారత ఆర్థిక వ్యవస్థనే పతనం అంచుకు నెట్టిన, మదుపరుల నెత్తిన శఠగోపం పెట్టిన పాపులను వదిలి.. ఢిల్లీ రాష్ట్ర సర్కారుతో ఎలాంటి సంబంధం లేని కవితను కేవలం కేసీఆర్ తనయ అయినందునే కేసును ఆపాదించడం పిల్లలు గల ప్రతి తల్లిదండ్రుల మనసును గాయపర్చడమే. పర్సులో పది రూపాయలుంటే అన్నార్తులు, దీనార్తులు, అభాగ్యులు, నమ్ముకున్న వారికి పంచేసి ఖాళీ పర్సుతో తిరిగి ఇంటికెళ్ళే ఉదార ప్రజా నాయకురాలు కవిత వ్యక్తిత్వాన్ని ఇటువంటి కుటిల కేసులు ఏమాత్రం దెబ్బతీయలేవు. అందుకే,ఒక పాపులర్ సామెత ఒక పాపులర్ ప్రజాజీవిత కవిత విషయంలో ప్రభావమంతంగా ఉల్టాగా నమోదైంది. నిజం గడప దాటేలోగా అబద్ధం ప్రపంచాన్ని చుట్టేస్తుందనే నానుడి ఇక్కడ రివర్స్ అయింది. అబద్ధం గడప దాటేలోగా నిజం ప్రపంచానికి రీచ్ అయింది.

> ఎవరెస్టు సమాన కీర్తిప్రతిష్ఠల వ్యక్తిత్వాన్ని ఈ అరెస్టు ఏమాత్రం మసకబారనీయదు. పైగా తెలంగాణ టూ యావద్భారత ప్రజానీకాన్ని దగ్గర చేస్తుంది. యువత సహా ఆబాల గోపాలం తమ నాయకురాలిగా, తమ గొంతుగా గర్వపడతారామెను.

ఇల్లెందుల దుర్గాప్రసాద్
94408 50384

# మన భవిష్యత్తుకు ఓటేద్దాం

> తెలంగాణ శాసనసభ ఎన్నికలు ముగిసి మూడు నెలలు గడిచిపోయాయి. మరికొద్ది రోజుల్లో దేశంలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో ప్రజలను ఆకట్టుకోవడానికి మళ్లీ నాటకాలు మొదలయ్యాయి. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ ప్రజానీకం ఏ పార్టీకి ఓటెయ్యాలి? తమ సమస్యలు పార్లమెంట్‌కు చేరవేసే ప్రతినిధులుగా ఎవరిని ఎన్నుకోవాలి? ఏది సరైన నిర్ణయం? ఇప్పటికే తప్పటడుగు వేసి తిప్పలు పడుతున్న ప్రస్తుత తరుణంలో ఆచి తూచి వ్యవహరించాల్సిన అవసరం ఉంది. చీకటి దిశగా సాగుతున్న తెలంగాణ గమనాన్ని వెలుగుల వైపు మళ్లించాల్సిన ఆవశ్యకత ఉంది. రాష్ట్ర భవిష్యత్తు, మన భవిష్యత్తుకు ఎంతో కీలకమైన ఈ సమయంలో.. మనల్ని పాలించిన, పాలిస్తున్న పార్టీల చరిత్రను ఓసారి తిరగేద్దాం.

దంటు కనకదుర్గ
89772 43484

శాసనసభ ఎన్నికల్లో గెలిచి మనల్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరిని మొట్టమొదటగా పరిశీలిద్దాం. దాదాపు 44 ఏండ్లు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించి, మన ప్రాంతాన్ని వెనక్కినెట్టిన కాంగ్రెస్‌ను ప్రజలు మళ్లీ ఎందుకు ఎన్నుకున్నారు? ఈ ప్రశ్నకు కేవలం ఒకేఒక్క సమాధానం వినిపిస్తున్నది. 2014లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ తన మేధస్సును, తెలంగాణ పట్ల తనకున్న ప్రేమాభిమానాలను రంగరించి ప్రతిఒక్కరి అవసరాలను గుర్తించి, ప్రవేశపెట్టిన పథకాలతో తొమ్మిదిన్నరేండ్ల పాటు ప్రజలు ఆనందంగా జీవించారు. వ్యవసాయం, పరిశ్రమలు, పోలీసు వ్యవస్థ, స్త్రీల భద్రత, వైద్యం, విద్య, వృత్తులు, దేవాలయాలు, సాంస్కృతిక పునరుజ్జీవం, స్వచ్ఛమైన తాగునీరు.. ఇలా అన్ని రంగాలు అభివృద్ధి చెంది, సకల వసతులు సమకూరాయి. నిస్సహాయ వృద్ధులకు, దివ్యాంగులకు, బీడీ కార్మికులకు పింఛన్లు అందాయి. తెలంగాణ అభివృద్ధి పథంలో స్థిరపడిపోయింది. ఇక ప్రజలు ఏమనుకున్నారంటే.. ప్రస్తుతం అమలవుతున్న పథకాలకు కాంగ్రెస్ ఎన్నికల ముందు ఊదరగొట్టిన పథకాలన్నీ కలుస్తాయని భ్రమపడ్డారు. రైతుబంధు పెరిగి రైతుభరోసాగా మారుతుందని, మహిళలందరికీ పెన్షన్లు, ఉచిత ప్రయాణం, గృహజ్యోతి, చౌకగా గ్యాస్ సిలిండర్, రెండు లక్షల ఉద్యోగాలు.. ఇలాంటివన్నీ అదనంగా చేరితే తమ జీవితాలు ఇంకా బాగుంటాయని అనుకున్నారు. మరి జరిగిందేమిటి? రైతుబంధు రచ్చ అవుతుందని, మిషన్ భగీరథ నల్లా బంద్ అవుతుందని, కాళేశ్వరం కట్టేస్తారని, పెంచుతామన్న పెన్షన్లు తుంచుతారని ప్రజలు ఊహించలేదు. ఏదేదో ఊహించుకొని పెద్ద ఎత్తున కాంగ్రెస్‌కు ఓటేసిన రైతులు, నిరుద్యోగులు ఇప్పుడిప్పుడే ఆ పార్టీ వైఖరిని పసిగడుతున్నారు.

కాంగ్రెస్ పాలనలో అనతికాలంలోనే నిన్నమొన్నటిదాకా పచ్చగా ఉన్న పైర్లు ఎండిపోయాయి. సిరులు పండిన నేల నెర్రెలు బారింది. నీళ్లు లేక, కరెంటు లేక, పెట్టుబడి సాయం అందక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. రాత్రి కరెంటుతో షాక్ తగిలి అన్నదాతలు మరణిస్తున్నారు. అకాలమరణం చెందిన రైతు కుటుంబాలను ఆదుకునే రైతుబీమాను ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కార్.. ఆ పార్టీకి ఓట్లేసి గెలిపించిన రైతులను ఓడగొట్టింది.

ఇక నిరుద్యోగుల సంగతి సరేసరి. విద్యావంతులై కూడా కాంగ్రెస్ లాంటి పార్టీని నమ్మి మోసపోయారు. ఎంపికైన ఉద్యోగార్థుల్లో ఆంధ్రా మూలాలున్న యువతకే ఎక్కువ కొలువులు దక్కడంతో నిరుద్యోగులు విస్తుపోయారు.

> గత ప్రభుత్వ పథకాలన్నీ నిలిపివేసి, తెలంగాణ ప్రజలను కష్టాలపాలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆంధ్రాకు చెందిన కుమారి ఆంటీ క్యాంటీన్ సమస్యను గంటల్లోనే పరిష్కరించడం చూసి నిరుద్యోగులు నివ్వెరపోయారు. చిత్రమేమిటంటే.. తెలంగాణ ఉద్యమం, అప్పటి కాంగ్రెస్ పాలన గురించి పుస్తకాల్లో చదివి కూడా ఆ పార్టీ వైఖరిని యువత అర్థం చేసుకోకపోవడం. ఎంతో కష్టపడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని మళ్లీ కాంగ్రెస్ పార్టీ చేతుల్లో పెట్టడం. తెలంగాణ వ్యతిరేకి అయిన చంద్రబాబు శిష్యుడిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవడం. ఓటుకు నోటు కేసులో పట్టుబడ్డ వ్యక్తిని, మోదీ మళ్లీ ప్రధాని కావాలని పబ్లిక్‌గా చెప్పానే బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య ఒప్పందముందని అబద్ధాలు చెప్పగలిగిన వ్యక్తిని ప్రజలు నమ్మడం. ఇంతకంటే అమాయకులు ప్రపంచంలో మరెవరూ ఉండరేమో!

రాష్ట్రానికి, ప్రజలకు మంచిచేసే ఒక్క విషయం కూడా తెలంగాణ అసెంబ్లీలో చర్చకు రాదని గత సమావేశాల్లోనే తేలిపోయింది. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన పథకాలు మంచివి కావని వాదించి, వాటిని నిలిపివేసి, మళ్లీ ఆంధ్రా పెత్తనం దిశగా కాంగ్రెస్ సాగుతున్నదని ప్రజలు గ్రహించాలి. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు గెలిచినా తెలంగాణకు అపార నష్టం జరుగుతుందన్న సత్యాన్ని ప్రజలు గుర్తెరగాలి. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలి. తెలంగాణ ప్రగతి, క్షేమం కోసం ఆ పార్టీ ప్రతినిధులను పార్లమెంట్‌కు పంపించాలి. ఎందుకంటే, అందరూ అనుకుంటున్నట్టు.. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బలగంతో సహా బీజేపీలో చేరితే రాష్ట్రానికి మరింత నష్టం చేకూరుతుంది.

ఇక కమలం పార్టీ మొదటినుంచి తెలంగాణను శత్రువుగానే చూస్తున్నది. 2014 నుంచి ఆ పార్టీది అదే వైఖరి. గత రెండు ఎన్నికల్లో ఎన్నికైన బీజేపీ ఎంపీలు గానీ, శాసనసభ్యులు గానీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా తీసుకురాలేదు. మన ప్రాజెక్టులకు జాతీయ హోదా తేలేదు. కనీసం ధన సహాయం తెచ్చారా అంటే, అదీ లేదు. పైగా అత్యద్భుతంగా పాలించిన బీఆర్ఎస్‌పై నిందలు మోపడం, వ్యక్తిగత దూషణలకు దిగడం తప్ప ఆ పార్టీ నేతలు చేసిందేమీ లేదు. కనీసం తెలంగాణ రైతుల పంటను కూడా కేంద్రం కొనేటట్టు చేయలేకపోయారు. పైగా 'గంగా యమునా తెహజీబ్'లాగా ఉన్న హిందూ, ముస్లిం సోదరులను విడదీయటానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఈ మత మౌఢ్య పార్టీకి ఓటేస్తే తెలంగాణ మరో మణిపూర్ కాష్టంలాగా కాలడం ఖాయం. జాతీయ నాయకులకు బానిసలైన స్థానిక బీజేపీ నేతలు తెలంగాణకు ఏం సాయం చేయగలరని వారికి ఓటెయ్యాలి?

తమ అక్రమ సంపాదనకు తోడు నెహ్రూ కుటుంబానికి రాష్ట్ర సంపదను దోచిపెట్టే కాంగ్రెస్, గుజరాతీ వ్యాపారులకు దేశ సంపదను దోచిపెట్టే బీజేపీల అవసరం ఈ రాష్ట్రానికి లేనే లేదు. వారికి ఒక్క ఓటు కూడా పడకూడదు. ఏనాటికైనా తెలంగాణ సాధించిన ఉద్యమ పార్టీ బీఆర్ఎస్సే ఈ రాష్ట్రానికి శ్రీరామరక్ష. కేసీఆర్ మాత్రమే రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపే అసలైన నాయకుడు.

# మత స్వేచ్ఛను గౌరవించాలి

***ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాల ప్రకారం.. అన్ని సామాజికవర్గాల వారిని సమానంగా చూడాలి. మత స్వేచ్ఛను గౌరవించాలి. భారత్‌లో ఇటీవల తీసుకొచ్చిన సీఏఏను, దాని అమలు తీరుతెన్నులను పరిశీలిస్తున్నాం.***

**- మ్యాథ్యూ మిల్లర్,**
***అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ అధికారప్రతినిధి***

> అమెరికా ఎన్నికల బరిలో మరోసారి ముదివగ్గులే నిలిచారు. అగ్రరాజ్య పీఠాన్ని యువతరం, మహిళలు అధిరోహించే అవకాశం మరోసారి చేజారింది. ప్రపంచదేశాల్లో యువత, మహిళా నేతల హవా నడుస్తుంటే.. అందుకు భిన్నంగా అగ్రరాజ్యం ఎన్నికలు జరుగుతుండటం చర్చనీయాంశం.

# అమెరికా బరిలో ముదివగ్గులే

వి.వి.వెంకటేశ్వరరావు
63008 66637

అమెరికా అధ్యక్ష ఎన్నికలను యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా పరిశీలిస్తూ ఉంటుంది. ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం తదితర అంశాలే అందుకు కారణం. అమెరికా తీసుకునే నిర్ణయాల ప్రభావం ప్రపంచ దేశాలపై ఉంటుందనడంలో సందేహం లేదు. పరోక్షంగా ప్రపంచ దేశాలను అగ్రరాజ్యం శాసిస్తుంటుంది. అటువంటి దేశ అత్యున్నత పీఠాన్ని ఈసారైనా యువత, మహిళల్లో ఎవరైనా అధిరోహిస్తారా? అన్న ఆసక్తి అందరిలోనూ నెలకొన్నది. కానీ, ఈసారి కూడా ఊరించి ఉసూరుమనిపించారు పోటీలో నిలిచిన పలువురు ప్రముఖులు.

ఇటీవల ముగిసిన సూపర్ ట్యూజ్‌డేతో ప్రధాన పార్టీలైన రిపబ్లికన్, డెమొక్రాటిక్‌ల తరపున పోటీ చేసే అభ్యర్థులు ఎవరనేది తేలిపోయింది. ప్రైమరీ ఎన్నికల్లో మొదటి నుంచి ఆధిపత్యం చెలాయిస్తూ వస్తున్న జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రత్యర్థులుగా బరిలో నిలవడం ఖాయమైపోయింది. డెమొక్రాటిక్ అభ్యర్థిత్వానికి మొదటి నుంచే పెద్దగా పోటీ లేదు. కానీ, రిపబ్లికన్ పార్టీ తరపున కదనరంగంలోకి దిగేందుకు పలువురు చివరి వరకు ప్రయత్నించారు. వారిలో భారత సంతతికి చెందిన వ్యాపారవేత్త వివేక్ రామస్వామితో పాటు నిక్కీ హేలీ కూడా ఉండటం విశేషం. అయితే వివేక్ రామస్వామి కాస్త ముందుగానే తప్పుకోగా, నిక్కీ హేలీ మాత్రం చివరి వరకు పోరాడారు. ట్రంప్‌కు పోటీ ఇచ్చిన ఆమె సూపర్ ట్యూజ్‌డేకు ఒకరోజు ముందుగా పోటీ నుంచి తప్పుకొన్నారు. ఇక డెమొక్రాటిక్ పార్టీ నుంచి మరోసారి బైడెన్ పోటీలో ఉండటం ఖాయమైపోయింది. అమెరికాలో భారత సంతతి ప్రాబల్యం పెరుగుతుండటంతో ఉపాధ్యక్ష అభ్యర్థిగా కమలా హ్యారిస్‌కే మళ్లీ అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అధికార పీఠాన్ని అధిరోహించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. నాలుగు వేర్వేరు కేసుల్లో నేరారోపణలను ఎదుర్కొంటున్న ఆయన కోర్టు అనుమతితో మరోసారి బరిలో నిలిచారు. అయినప్పటికీ రాయిటర్స్ తదితర సంస్థల సర్వేల్లో ట్రంప్ తన ప్రత్యర్థుల కంటే ఎక్కువ పాపులర్ రేటింగ్ సాధించారు. తన శత్రువులపై ప్రతీకారం తీర్చుకుంటానని బహిరంగంగా ప్రమాణం చేస్తున్న ట్రంప్.. మరోసారి పోటీలో నిలవడం వైచిత్రిగానే చెప్పుకోవాలి.

ట్రంప్ ప్రత్యర్థి బైడెన్ అనేక ప్రతికూలతలను ఎదుర్కొంటున్నారు. ఆయనకు మతిమరుపు ఉన్నదనే ఆరోపణ ఎప్పటి నుంచో ఉన్నది. అదీకాకుండా వయోభారం కారణంగా బైడెన్ మరో నాలుగేండ్లు పాలించగలరా? అనే సందేహాలు అమెరికన్లలో కలుగుతున్నాయి. ఓవైపు వయస్సు అడ్డువస్తుండగా.. మరోవైపు పేలవమైన పాపులర్ రేటింగ్ బైడెన్‌ను వెంటాడుతున్నప్పటికీ ఆయన మరోసారి అధ్యక్ష బరిలో నిలవడం గమనార్హం. మరో నాలుగేండ్లు పాలించే సత్తా తనకు ఉందని ప్రజలను ఒప్పించేందుకు ఆయన సర్వశక్తులను ఒడ్డుతున్నారు. ఇటీవల విడుదలైన రాయిటర్స్ పోల్‌లో 35 శాతం మంది బైడెన్‌కు మద్దతుగా నిలిచారు. అయితే రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధ పరిణామాలు బైడెన్‌కు ప్రతికూలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. గాజాలో 25 వేల మందికి పైగా ప్రజలు మరణించడంతో సొంత పార్టీ నేతల నుంచే ఆయన విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. అమెరికా ఇమిగ్రేషన్ పాలసీపై కూడా విమర్శలున్నాయి.

> ఏదేమైనప్పటికీ వయసు మీదపడ్డ నేతలే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి ప్రత్యర్థులుగా మారడం విచిత్రం. వయోభారంతో ఇబ్బందులు పడుతున్న వీరిపై అమెరికాలోని మెజారిటీ వర్గం ఆసక్తి చూపడం లేదన్నది కఠోర సత్యం. వివిధ సర్వేల్లో వారికి వచ్చిన పాపులర్ రేటింగ్స్ అందుకు నిదర్శనం. అయితే అమెరికన్లకు ఇష్టం ఉన్నా, లేకున్నా మరోసారి ముదివగ్గులైన పాలకులనే ఎన్నుకోక తప్పదు.




# లక్షద్వీప్‌లో జటాయు

> లక్షద్వీప్‌లోని మినీకాయ్ ద్వీపంలో వ్యూహాత్మక నౌకాదళ స్థావరాన్ని భారత్ ఏర్పాటు చేసింది. ఐఎన్ఎస్ జటాయు పేరిట నెలకొల్పిన ఈ స్థావరాన్ని నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ ఇటీవల ప్రారంభించారు. సీతమ్మను అపహరించుకుపోతున్న రావణుడిని ఎదుర్కొన్న జటాయు పేరు దీనికి పెట్టడం విశేషం.

1980లోనే మినీకాయ్‌లో నావికాదళ కార్యక్రమాలు ప్రారంభించిన భారత్.. 2012లో ఐఎన్ఎస్ ద్వీప్‌రక్షక్ పేరిట కవరత్తిలో మొదటి పూర్తిస్థాయి నౌకాదళ స్థావరాన్ని నెలకొల్పింది. చైనా సరిహద్దుల్లో సైనిక ప్రతిష్టంభన, మాల్దీవులతో వివాదం నేపథ్యంలో మినీకాయ్‌లోని వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. ఐఎన్ఎస్ జటాయు మోహరింపుతో తీరప్రాంత పరిరక్షణలో వ్యూహాత్మక అడుగులు వేయడంతో పాటు భారత సైనిక ఉనికిని, పరిధిని విస్తరించినట్టయింది.

శ్రీలంకలోని హంబన్‌తోట ఓడరేవు, పాకిస్థాన్‌లోని గ్వాదర్‌లో మౌలిక సదుపాయాల కల్పనను చైనా వేగవంతం చేస్తున్నది. వివిధ ప్రాజెక్టుల ద్వారా భారత తీరానికి చేరువయ్యేందుకు డ్రాగన్ ప్రయత్నిస్తున్నది. హిందూ మహాసముద్రంలో చైనా ఉనికి పెరుగుతుండటంతో భారత నావికా సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అందుకే ఈ ప్రాంతంలో నౌకాదళ స్థావరాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. పైరసీ, మాదకద్రవ్యాల రవాణాకు ఈ స్థావరం అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది. మాల్దీవులతో దౌత్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో హిందూ మహాసముద్రంలో చైనా ఆధిపత్యాన్ని కట్టడి చేయడంలో ఐఎన్ఎస్ జటాయు ప్రధాన పాత్ర పోషిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. పైగా దీని ద్వారా చైనా-మాల్దీవుల కార్యకలాపాలపై నిఘా పెట్టవచ్చు.

దక్షిణాసియాలో ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు భారత్, చైనాలకు మాల్దీవులు వ్యూహాత్మకంగా కీలకమైనది. అందుకే మన దేశం ఎప్పటినుంచో మాల్దీవులకు సాయం చేస్తున్నది. అందులో భాగంగానే 45కు పైగా మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపట్టింది. పర్యాటక ఆదాయంపైనే ఆధారపడుతున్న మాల్దీవులకు అత్యధికంగా వెళ్లేది భారతీయులే. మాల్దీవుల గత ప్రభుత్వం భారత్‌తో సఖ్యతతోనే వ్యవహరించేది. కానీ, ఇటీవల ఎన్నికైన మొయిజు సర్కార్ చైనాకు వత్తాసు పలుకుతున్నది. చైనా కూడా కొన్నేండ్లుగా మాల్దీవులకు ఆర్థికసాయం అందిస్తూ, మౌలిక సదుపాయాల కల్పన, పోర్టుల లీజు ఒప్పందాలతో ఆ దేశంతో సంబంధాలను బలోపేతం చేసుకుంటున్నది.

చైనా అనుకూల విధానాన్ని అనుసరిస్తున్న మొయిజు మాల్దీవులలో ఉన్న మన సైనికులు వెనక్కి వెళ్లిపోవాలని పట్టుబడుతున్నారు. ఇతర దేశాలకు చెందిన సైనికులు తమ నేలపై ఉండకూడదని ఆయన తేగేసి చెప్తున్నారు. భారత్ అందించిన హెలీకాప్టర్ నిర్వహణ సేవలను సైనికులకు బదులుగా సాంకేతిక సిబ్బంది అందించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అందుకే ఇటీవల సాంకేతిక నిపుణుల బృందాన్ని అక్కడికి పంపింది భారత్. మే 10 తర్వాత మాల్దీవులలో భారత సైనికులెవరూ ఉండరని ఇటీవల మొయిజు ప్రకటించారు. అయితే అంతకుముందు రోజే మాల్దీవులు, చైనా మధ్య మిలటరీ సహకారానికి సంబంధించి ఒప్పందం కుదరడం ఆందోళనకరం.

> భారత్ పట్ల మొయిజు వ్యవహారశైలితో మాల్దీవులు భారీగా నష్టపోయింది. ఆ దేశ పర్యాటక రంగం కుదేలైంది. 2.09 లక్షలతో మాల్దీవుల పర్యాటకుల్లో అగ్రస్థానంలో ఉండే భారతీయుల సంఖ్య 20 వేలకు పడిపోయింది. దీంతో ఆ దేశ పర్యాటక ఆదాయం భారీగా తగ్గిపోయింది. అయినా ఇవేమీ పట్టని మొయిజు భారత్‌పై నిప్పులు కక్కుతూనే ఉన్నారు. అయినప్పటికీ మానవతా దృక్పథంతో భారత్ ఆ దేశానికి సాయం అందిస్తూ, ఆదుకుంటూనే ఉన్నది.

ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయాన్ని పక్కన పెట్టి మరీ తుర్కియే, చైనాలలో మొయిజు మొదటగా పర్యటించడం గమనార్హం. భారత్-మాల్దీవుల మధ్య నెలకొన్న దౌత్య వివాదాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని, మాల్దీవులపై పట్టు పెంచుకోవాలని, తద్వారా భారత్‌ను దెబ్బకొట్టాలని చైనా భావిస్తున్నది. అందులో భాగంగానే భారత కదలికలపై నిఘా వేసేందుకు మాల్దీవులను బేస్‌గా మార్చుకోవాలని చైనా కుట్ర పన్నుతున్నది. అయితే మినీకాయ్‌లో ఏర్పాటు చేసిన నావికా స్థావరంతో చైనా, మాల్దీవుల కుట్రలకు చెక్ పెట్టినట్టయింది.

యేచన్ చంద్రశేఖర్
88850 50822